సాక్షి
నంద్యాల
గురువారం । 12 । జనవరి । 2023



నృత్య నీరాజనం

శ్రీశైలంటెంపుల్: నిత్యకళావేదికపై బుధవారం విజయవాడ అభినయ ఆర్ట్స్ అకాడమీకి చెందిన చింతా వెంకట్ వారిచే సంప్రదాయ నృత్య ప్రదర్శన ఆకట్టుకుంది.



అన్నదానానికి విరాళం

శ్రీశైలంటెంపుల్: నిత్యాన్నదాన పథకానికి బుధవారం హైదరాబాద్‌కు చెందిన ఫణీశ్వర్ రూ. లక్ష, విజయవాడకు చెందిన బండి లక్ష్మణరావు రూ. లక్ష విరాళం అందజేశారు.



టీబీ డ్యాం సమాచారం

పూర్తి మట్టం	: 1,633 అడుగులు
ప్రస్తుతం	: 1,622.21
టీఎంసీల సామర్థ్యం	: 105,788
ప్రస్తుతం	: 67,745
ఇన్‌ఫ్లో (క్యూసెక్కులు)	: 000
ఔట్‌ఫ్లో (క్యూసెక్కులు)	: 8,099

న్యూస్‌రీల్

నేటి నుంచి సంక్రాంతి సెలవులు

నంద్యాల(సిటీ): జిల్లాలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ విద్యా సంస్థలకు గురువారం నుంచి ఈ నెల 18వ తేదీ మంగళవారం వరకు సంక్రాంతి సెలవులు ప్రకటిస్తున్నట్లు డీఈఓ అనురాధ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. 19వ తేదీ బుధవారం జిల్లాలోని అన్ని పాఠశాలలు పునః ప్రారంభం అవుతాయన్నారు. సెలవుల్లో ఎటువంటి తరగతులు నిర్వహించరాదని, అలా చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు.

అదనపు క్యూలైన్లు ఏర్పాటు



ఆలయ అధికారులకు సూచనలు చేస్తున్న ఈఓ

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల భక్తుల సౌకర్యార్థం స్వామివారి ఆలయ ముఖ మండపంలో ప్రస్తుతం ఉన్న క్యూలైన్ల కంటే ఎత్తులో అదనంగా మరో క్యూలైన్ ఏర్పాటు చేయాలని అధికారులను దేవస్థాన ఈఓ లవన్న ఆదేశించారు. ఫిబ్రవరి 11 నుంచి 21వ తేదీ వరకు శ్రీశైలంలో మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల నేపథ్యంలో విస్తృత ఏర్పాట్లపై బుధవారం ఈఓ లవన్న, ధర్మకర్తల మండలి సభ్యులు మేరాజోత్ హనుమంతు నాయక్, ఇంజినీరింగ్, ఆలయ విభాగ అధికారులతో కలిసి ఆలయ ప్రాంగణాన్ని పరిశీలించారు. మహాశివరాత్రి సందర్భంగా వీవీఐపీలు, వీఐపీలకు వేర్వేరు గ్యాలరీలను ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. ఆలయ ప్రాంగణంలో ఉత్తర, పశ్చిమ భాగాలలో భక్తులు పాగాను దర్శించుకునేలా ఏర్పాట్లు చేయాలన్నారు.

మహానందీశ్వరుడి హుండీ ఆదాయం రూ.36.89 లక్షలు



హుండీ కానుకలు లెక్కిస్తున్న దృశ్యం

మహానంది: మహానందిలో జరిగిన హుండీ కానుకల లెక్కింపుల ద్వారా మహానందీశ్వరుడికి రూ.36,89,430 ఆదాయం లభించినట్లు ఈఓ కాపు చంద్రశేఖరరెడ్డి తెలిపారు. స్థానిక అభిషేక మండపంలో బుధవారం హుండీ కానుకల లెక్కింపును నిర్వహించారు. శ్రీకామేశ్వరీదేవి సహిత మహానందీశ్వర, కోదండ రామాలయం, వినాయకనంది ఆలయాల ద్వారా రూ.35,89,017, అన్నదాన విరాళాల ద్వారా రూ.74,214 వచ్చిందన్నారు. అలాగే గో సంరక్షణ విభాగం ద్వారా రూ.26,199 వచ్చినట్లు చెప్పారు. దీంతో పాటు 20 గ్రాముల బంగారు,743 గ్రాముల వెండి వస్తువులను భక్తులు బహూకరించారన్నారు. ఈ మొత్తం ఆదాయం 43 రోజులకు వచ్చినట్లు వివరించారు. కార్యక్రమంలో బనగానపల్లె దేవదాయశాఖ ఇన్‌స్పెక్టర్ హరిచంద్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు.


ముత్తూట్ ఫైనాన్స్‌లో బంగారం మాయం

బొమ్మలసత్రం: నంద్యాల పట్టణంలోని రాజ్‌థియేటర్ సమీపంలో ఉన్న ముత్తూట్ ఫైనాన్స్‌లో తనఖా పెట్టిన బంగారు ఆభరణాలు మాయం కావడంతో బుధవారం బాధితురాలు ఆందోళన చేపట్టింది. పట్టణానికి చెందిన బాధితురాలు సుభాషిణి గత ఏడాది జనవరిలో 3.50 తులాల బంగారు నల్ల పూసల గొలుసు, 7.5 గ్రాముల కమ్మలు తనఖా పెట్టి రూ. లక్ష అప్పుగా తీసుకుంది. మూడు నెలల క్రితం నగలు విడిపించుకునేందుకు ఫైనాన్స్ ఆఫీసు వద్దకు వెళ్లగా విషయం బయట పడింది. అప్పట్లో అక్కడ పనిచేసిన ఓ మహిళా మేనేజర్ చేతివాటమని గుర్తించిన సిబ్బంది కొంత గడువు కోరారు. అప్పటి నుంచి బంగారు ఆభరణాల గురించి అడిగితే సిబ్బంది సరైన సమాధానం చెప్పకుండా దాట వేస్తుండటంతో బుధవారం సుభాషిణి బంధువులతో కలిసి ఫైనాన్స్ కార్యాలయంలో ఆందోళనకు దిగింది. విషయం తెలుసుకున్న పోలీసులు అక్కడికి చేరుకోవడంతో వారంలోగా బాధితురాలికి ఆభరణాలకు బదులుగా పరిహారం అందజేస్తామని సిబ్బంది హామీ ఇచ్చారు.

డీసీసీబీ పాలకవర్గం పదవీ కాలం పొడిగింపు

కర్నూలు(అగ్రికల్చర్): జిల్లా సహకార కేంద్ర బ్యాంకు(డీసీసీబీ) ఏడుగురు సభ్యుల నాన్ అఫీషియల్ పాలకవర్గం పదవీ కాలాన్ని జూలై 17 వరకు పొడిగిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఇప్పటివరకు ఎస్.మహాలక్ష్మి నేతృత్వంలో నాన్ అఫీషియల్ పాలకవర్గం కొనసాగుతోంది. పదవీ కాలం ఈనెల 17 వరకు ఉంది. ఇదే పాలకవర్గం పదవీకాలాన్ని పొడిగిస్తూ ప్రభుత్వ ముఖ్య కార్యదర్శి చిరంజీవి చౌదరి జీవో ఆర్‌టీ నం.41 జారీ చేశారు.

వెదురు చూపులు



విస్తారంగా పెరిగిన వెదురు వనాలు

- నల్లమలలో వెదురు సేకరణలో అటవీ అధికారుల తాత్సారం
- సీజన్ మొదలై నాలుగు నెలలైనా టెండర్లు పిలవడంలో అలసత్వం
- ఉమ్మడి జిల్లాలో వెదురు విస్తీర్ణం సుమారు లక్ష హెక్టార్లు
- సకాలంలో సేకరించకపోవడంతో ఎండిపోతున్న వెదురు గుమ్మలు
- ప్రభుత్వ ఆదాయానికి గండి

సహజసిద్ధంగా మొలకెత్తి.. ఎరువు, మందులు వేయకుండానే విస్తారంగా పెరిగి.. ప్రభుత్వానికి కోట్లాది రూపాయల ఆదాయాన్ని తెచ్చి పెట్టే వెదురును అధికారులు నిర్లక్ష్యం చేస్తున్నారు. సీజన్ మొదలై నాలుగు నెలలైనా వెదురు సేకరణ పనులు ప్రారంభించకపోవడంతో అవే పనులను నమ్ముకున్న రెండు వేల గిరిజన కుటుంబాలు కళ్లల్లో ఒత్తులేసుకుని ఎదురు చూస్తున్నారు.

గత ఏడాది వెదురు కూపుల ద్వారా వచ్చిన ఆదాయం వివరాలు

కూపు	వెదురు సేకరణ లక్షల్లో	పనివిలువ రూపాయల్లో	రవాణా ఖర్చు రూపాయల్లో
పచ్చగుండాల	1,17,124	4,35,000	7,26,000
పచ్చర్ల	35,826	1,42,000	1,94,000
దొరబావి	55,739	2,13,000	3,01,000
కోటకొండ	72,069	2,72,000	3,38,000
చిల్లమాని పెంట	46,694	1,81,000	2,98,000
గొర్రెగుంత	45,305	1,75,500	3,06,000
ఎంఎం చలిమ	34,244	1,36,000	1,76,000
అహోబిలం	14,700	65,000	82,000



సమయానికి నరక్క పోవడంతో చెదలు పట్టి ఎండిపోయిన వెదురు గుమ్మలు

అప్పు పుట్టడం లేదు



ఈమె గాజులపల్లె గ్రామానికి చెందిన చెంచు చుక్కమ్మ. భర్తతో కలిసి ఇరవై ఏళ్లుగా వెదరు సేకరణ పనులకు వెళ్తుండేది. కొండలో ఫస్ట్‌క్లాస్ వెదురు కర్ర కొడితే ఒక్కో వెదురుకు రూ.11, సెకండ్ క్లాస్‌కు రూ.7, థర్డ్‌క్లాస్ వెదురు నరికితే రూ.4 ఇచ్చేవారు. ఇలా రోజుకు రూ.700 నుంచి రూ.1,200 వరకు సంపాదించుకునేవారు. ఈ ఏడాది సేల్స్ మొదలు పెట్టక పోవడంతో కుటుంబం గడవడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తోంది.

వేరే పని తెలియదు



ఇక్కడ కనిపిస్తున్న ఈ వ్యక్తి పేరు చెంచు రాముడు. పచ్చర్ల గ్రామానికి చెందిన ఇతను సుమారు 20 ఏళ్లుగా వెదురు నరికే పని చేస్తుండేవాడు. రోజుకు రూ.500 నుంచి రూ.700 వరకు కూలీ వస్తుండేది. ఈ ఏడాది సేల్స్ మొదలు పెట్టక పోవడంతో కుటుంబ పోషణ నిమిత్తం అప్పు చేసి కాలం గడుపుతున్నామని త్వరగా పనులు మొదలు పెట్టాలని వేడుకుంటున్నాడు.

త్వరలో అనుమతులు రానున్నాయి



ప్రతి పదేళ్లకోసారి అటవీ సంరక్షణపై సమీక్షించడం ఉంటుంది. దీనికి తోడు కొత్త జిల్లాలు ఏర్పాటు కావడంతో వెదురు సేకరణకు టెండర్లు పిలవడం ఆలస్యమైంది. త్వరలోనే టెండర్లు పిలిచి సేకరణ పనులు మొదలు పెట్టేందుకు చర్యలు తీసుకుంటాం. – శ్రీపతి నాయుడు, అటవీ రేంజ్ అధికారి, రుద్రవరం

ఆళ్లగడ్డ: జిల్లాలో సుమారు లక్ష హెక్టార్ల మేరకు వెదురు వనాలు విస్తారంగా ఉన్నాయి. ఇందులో వెదురు సేకరణకు గాజులపల్లి, రుద్రవరంలోని జీటీడీ (గవర్నమెంట్ టింబర్ డిపో)ల పరిధిలోని గొర్రెగొంత, చిరుమానుపెంట, అహోబిలం, ఎంఎంచలిమ, పచ్చగుండాల, పచ్చర్ల, దొరబావి, కోటకొండ తదితర కూపుల్లో (ప్రాంతాల్లోని) 15,000 హెక్టార్లలో అటవీ శాఖ ఆధ్వర్యంలో వెదురు కూపులను పెంచుతూ అందులో ఏటా వెదురు సేకరణ చేపడుతున్నారు. కూపులను ఆరు భాగాలుగా విభజించి బాగా పెరిగిన తరువాత కూలీలతో నరికించి డిపోలకు తరలించి వేలం పాటలు నిర్వహించడం ఆనవాయితీ. అయితే ఆగస్టులో మొదలు కావాల్సిన సేల్స్ (వెదురు సేకరణ)కు ఇంతవరకు టెండర్లు పిలవకపోవడంతో ఇక ఈ ఏడాది వెదురు సేకరణ ఉంటుందా లేదా అని అవే పనులపై ఆధారపడి జీవనం సాగిస్తున్న గిరిజన కుటుంబాలు ఆందోళన చెందుతున్నాయి.

రెండు వేల కుటుంబాల ఉపాధికి మంగళం

గాజులపల్లె నుంచి చాగలమర్రి వరకు ఉన్న కొండకింద పల్లెల్లోని మహానంది, శిరివెళ్ల, రుద్రవరం, ఆళ్లగడ్డ మండలాల పరిధిలోని చెంచు, గిరిజనులతో పాటు ఇతర కూలీలు రెండు వేల కుటుంబాల వరకు వెదురు సేకరణలో ఏటా జీవనోపాధి దొరుకుతుంది. వెదురు నరికే సీజన్ సెప్టెంబర్ నుంచి జూలై వరకు ఉంటుంది. ఈ 10 నెలల పాటు వీరికి చేతి నిండా పని ఉంటుంది. వెదురు నరకడం, లోడ్ చేయడం, గ్రేడింగ్ చేయడం, లాట్‌లు కట్టడం వంటి పనుల ద్వారా ఆదాయం సమకూరుతుంది. దశాబ్దాలుగా ఇవే పనులపై ఆధారపడి జీవనం సాగిస్తున్నారు. సీజన్ మొదలు అయ్యేవరకు కాంట్రాక్టర్ వద్ద అప్పు చేసి కుటుంబాలను పోషించుకుంటారు. కాగా ఈఏడాది అధికారుల నిర్లక్ష్యం వల్ల గిరిజన కుటుంబాలకు ఉపాధి కరువైంది.

ప్రభుత్వ ఆదాయానికి గండి

కూపుల్లో నరికిన వెదురు గాజులపల్లె, రుద్రవరం జీ.టీ.డీ.లకు తరలిస్తారు. అక్కడ నెలలో రెండు సార్లు వేలంపాటలు నిర్వహించి ఎవరు ఎక్కువ ధర చెల్లిస్తారో వారికి విక్రయిస్తారు. జిల్లాలో వెదరు వనాల ద్వారా ప్రభుత్వానికి ఏటా సుమారు రూ.4 కోట్ల వరకు ఆదాయం వస్తుంది. వెదురు కర్రలను వేలం వేసిన కాంట్రాక్టర్లు వీటిని మహారాష్ట్ర, పశ్చిమ బెంగాల్, కర్ణాటక, తమిళనాడు తదితర రాష్ట్రాలకు తరలిస్తారు. నల్లమల వెదురుకు దేశంలో మంచి డిమాండ్ ఉండటంతో కాంట్రాక్టర్లకు కూడా ఆదాయం బాగానే వస్తున్నట్లు తెలుస్తోంది. అయితే ఈ ఏడాది వెదురు సేకరణ గురించి అటవీ శాఖ అధికారులు ఏమాత్రం పట్టించుకోక పోవడంతో ఇటు ప్రభుత్వానికి అటు కాంట్రాక్టర్లకు ఆదాయం రాలేదు.

ఎండిపోతున్న వెదురు గుమ్మలు

వెదురు గడ్డి జాతి మొక్కలు. ఎంత నరికితే (కటింగ్) అంత విస్తారంగా పెరుగుతుంది. ఈ ఏడాది సీజన్ మొదలైనప్పటికీ వెదుర్ల సేకరణ చేపట్టక పోవడంతో గుమ్ములు పెద్దగా పెరిగి మొదళ్ల వద్ద పుట్టలు ఏర్పడి చెదలు పట్టి గుమ్ములు ఎండి కిందకు వాలిపోతున్నాయి.

త్వరలో పాణ్యంకు గవర్నర్ రాక

- ఈనెల 18, 20 తేదీన ఖరారయ్యే అవకాశం



పాణ్యం చెంచుకాలనీలో ఏర్పాట్లపై ఆరా తీస్తున్న నంద్యాల ఆర్డీఓ, డీఎస్పీ

పాణ్యం: రాష్ట్ర గవర్నర్ విశ్వ భూషణ్ హరి చందన్ త్వరలో పాణ్యంకు రాబోతున్నారు. స్థానిక గిరిజనులతో ముఖాముఖి అయ్యేందుకు వస్తున్నట్లు తెలుస్తోంది. గిరిజనుల జీవన శైలి, అభివృద్ధి, ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు గురించి తెలుసుకునేందుకు గవర్నర్ పాణ్యం వస్తున్నారు. ఈనెల 18 లేదా 20వ తేదీన పర్యటన ఖరారయ్యే అవకాశం ఉన్నట్లు అధికారులకు సమాచారం అందింది. ఈ మేరకు నంద్యాల ఆర్డీఓ శ్రీనివాసులు, డీఎస్పీ మహేశ్వరరెడ్డి, డీటీడబ్ల్యూఓ ఉసేనయ్య తదితరులు గవర్నర్ పర్యటన మేరకు బుధవారం పాణ్యం ప్రభుత్వ ఉన్నత పాఠశాల మైదానాన్ని పరిశీలించారు. హెలిప్యాడ్, సభా ప్రాంగణం, కాన్వాయ్‌తో పాటు తదితర అంశాలపై ఆరా తీశారు. ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో సభ నిర్వహిస్తే నెరవాడ వద్ద ఉన్న ఏపీ గిరిజన గురుకుల పాఠశాలలో హెలిప్యాడ్ ఏర్పాటుకు వీలుందా లేదా అనే విషయంపై ఆర్డీఓ, డీఎస్పీ మైదానాన్ని పరిశీలించారు. అంతకు ముందు చెంచుకాలనీలోని ఆశ్రమ పాఠశాల, పాణ్యం సచివాలయం-1 తదితర ప్రాంతాలను పరిశీలించారు. తాము పరిశీలించిన స్థలాల వివరాలు ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తామన్నారు. వారి వెంట సీఐ వెంకటేశ్వరరావు, ఎస్ఐ సుధాకర్‌రెడ్డి, తహసీల్దార్ మల్లికార్జునరెడ్డి, ఎంపీడీఓ దస్తగిరి, మాజీ సర్పంచ్ సుబ్బరాయుడు తదితరులు పాల్గొన్నారు.

సంక్రాంతి బ్రహ్మోత్సవాలకు నేడు అంకురార్పణ

- ఏడు రోజుల పాటు వైభవంగా ఉత్సవాలు
- స్వామిఅమ్మవార్లకు శాస్త్రోక్తంగా పూజాది క్రతువులు, వాహనసేవలు



విద్యుత్ దీపాలతో శ్రీశైల ఆలయం

శ్రీశైలంటెంపుల్: మకర సంక్రాంతి బ్రహ్మోత్సవాలకు శ్రీశైల ఆలయం సర్వాంగ సుందరంగా ముస్తాబైంది. గురువారం నుంచి 18వ తేదీ వరకు పంచాహ్నికదీక్షతో ఏడురోజుల పాటు ఉత్సవాలు అత్యంత వైభవంగా జరిపేందుకు దేవస్థాన అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. ప్రతిరోజు స్వామిఅమ్మవార్లకు విశేషంగా వాహన సేవ నిర్వహిస్తారు. ఉత్సవాల ప్రారంభం సందర్భంగా గురువారం ఉదయం 9.30 గంటలకు స్వామివారి యాగశాల ప్రవేశం, వేదపండితుల చతుర్వేద పఠనం, లోక కల్యాణాన్ని కాంక్షిస్తూ అర్చకులు బ్రహ్మోత్సవ సంకల్పాన్ని పఠిస్తారు. అలాగే మహాగణపతిపూజ, స్వస్తి పుణ్యాహవచనం జరిపిస్తారు. ఉత్సవాల నిర్వహణకు ఆధ్వర్యంలో నిర్వహించే శివపరివార దేవుడైన చండీశ్వరునికి విశేషపూజలు, కంకణధారణ, రుత్విగ్వరణం, అఖండ దీపారాధన, వాస్తుపూజ, వాస్తు హోమం, మండపారాధనల, కలశస్థాపన, పంచావరణార్చనలు, జపానుష్ఠానములు, పారాయణలు నిర్వహిస్తారు. తిరిగి సాయంత్రం 5.30 గంటలకు అంకురార్పణ, అగ్నిప్రతిష్ఠాపన, ధ్వజారోహణ, ధ్వజపటావిష్కరణ కార్యక్రమాలను నిర్వహిస్తారు. బ్రహ్మోత్సవాల్లో రెండవ రోజు శుక్రవారం నుంచి స్వామిఅమ్మవార్లకు విశేష వాహనసేవలు నిర్వహిస్తారు. మకర సంక్రాంతి రోజున స్వామిఅమ్మవార్లకు బ్రహ్మోత్సవ కల్యాణం జరిపిస్తారు.

చిరు వ్యాపారులకు ప్రభుత్వం అండ

- జగనన్న తోడు 6వ విడత ఆర్థిక సహాయం
- జిల్లాలో 16,423 మంది లబ్ధిదారుల ఖాతాల్లో రూ.35.10 లక్షల వడ్డీ జమ
- కలెక్టర్ మనజీర్ జిలానీ శామూన్, ఎమ్మెల్సీ ఇసాక్ బాషా



చెక్కును అందజేస్తున్న కలెక్టర్ మనజీర్ జిలానీ, జెడ్పీ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి, ఎమ్మెల్సీ ఇసాక్ బాషా

నంద్యాల: చిరు వ్యాపారులకు రాష్ట్ర ప్రభుత్వం అండగా నిలిచిందని జిల్లా కలెక్టర్ మనజీర్ జిలానీ శామూన్ పేర్కొన్నారు. తాడేపల్లి క్యాంప్ కార్యాలయం నుంచి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి బుధవారం వర్చువల్ విధానం ద్వారా చిరు వ్యాపారులు, సంప్రదాయ వృత్తిదారులకు జగనన్న తోడు పథకం కింద 6వ విడతలో భాగంగా రూ.10 వేల రుణం, గతంలో రుణాలు పొందిన వారి బ్యాంకు ఖాతాల్లో వడ్డీ రాయితీ జమ చేశారు. ఈ బృహత్తర కార్యక్రమాన్ని లైవ్ ద్వారా జిల్లా కలెక్టర్ మనజీర్, జిల్లా పరిషత్ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి, ఎమ్మెల్సీ ఇసాక్ బాషా, ఏపీఎస్పీడీసీఎల్ డైరెక్టర్ శశికళారెడ్డి, డీఆర్డీఏ ప్రాజెక్టు డైరెక్టర్ శ్రీధర్‌రెడ్డి తదితరులు వీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జగనన్న తోడు 6వ విడతలో భాగంగా జిల్లాలో అర్హులైన 16,423 మంది చిరు వ్యాపారులు, సంప్రదాయ వృత్తిదారులకు రూ. 35,10,668 వడ్డీ రాయితీ జమ అయ్యిందన్నారు. ఆళ్లగడ్డ నియోజకవర్గంలో 2,083 మంది లబ్దిదారులకు రూ.3,59,949, బనగానపల్లెలో 3,126 మందికి రూ.7,48,260, డోన్‌లో 1,929 మందికి రూ.3,50,670, నందికొట్కూరులో 1,867 మందికి రూ.2,71,613, నంద్యాలలో 1,091 మందికి రూ.1,81,581, పాణ్యంలో 760 మందికి రూ.1,60,655, శ్రీశైలంలో 1,568 మందికి రూ.3,52,497, అర్బన్‌లో 3,999 మందికి రూ. 10,85,443 జమ చేశామన్నారు. జిల్లా పరిషత్ చైర్మన్ పాపిరెడ్డి మాట్లాడుతూ చిరు వ్యాపారులు వారం వడ్డీలకు అప్పులు తెచ్చుకుని చాలా ఇబ్బందులు పడే వారని, వారి కష్టాలను తెలుసుకున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జగనన్న తోడు పథకాన్ని ప్రవేశ పెట్టి వారికి అండగా నిలిచారన్నారు. ఎమ్మెల్సీ ఇసాక్ బాషా మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అన్ని వర్గాల ప్రజలకు భరోసా కల్పిస్తుందన్నారు. అనంతరం రాయితీ జమ చెక్కును లబ్ధిదారులకు అందజేశారు.

అనుమతులు లేని మరబోట్లు నడిపితే సీజ్

- కలెక్టర్ మనజీర్ జిలానీ శామూన్



మాట్లాడుతున్న కలెక్టర్ మనజీర్ జిలానీ శామూన్, చిత్రంలో ఎస్పీ రఘువీర్‌రెడ్డి

నంద్యాల: కొత్తపల్లి మండలం సంగమేశ్వరం, సిద్దేశ్వరం ఘాట్ల నుంచి అనమతిలేని మరబోట్లు, పుట్టీలు నడిపితే సీజ్ చేయాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ మనజీర్ జిలానీ అధికారులను ఆదేశించారు. తెలంగాణ ప్రాంతంలో జరిగే సింగోటం జాతరకు నంద్యాల జిల్లా నుంచి కృష్ణా నది మీదుగా భారీగా తరలివెళ్లే భక్తులకు భద్రత కల్పించే అంశంపై జిల్లా కలెక్టర్ బుధవారం ఆయన చాంబర్‌లో ఎస్పీ రఘువీర్ రెడ్డి, జాయింట్ కలెక్టర్ నిశాంతి, డీఆర్ఓ పుల్లయ్యతో కలిసి పోలీసు, రెవెన్యూ, ఇరిగేషన్, మత్స్యశాఖ, టూరిజం అధికారులతో సమావేశం నిర్వహించారు. నదుల్లో మరబోట్లు, పుట్టీలు నడిపేందుకు డైరెక్టర్ ఆఫ్ పోర్ట్స్, ఏపీ కాకినాడ రేవు నుంచి లైసెన్సులు పొందాల్సి ఉంటుందని కలెక్టర్ తెలిపారు. బోటు సామర్థ్యం, భద్రతా ప్రమాణాలను దృష్టిలో ఉంచుకొని లైసెన్సులు మంజూరు చేస్తారన్నారు. జల వనరుల శాఖ నది లోతు, నీటి సామర్థ్యాన్ని బట్టి దారులను నిర్ణయిస్తూ అనుమతులు మంజూరు చేస్తుందన్నారు. ప్రస్తుతం జిల్లాలోని సంగమేశ్వరం, సిద్దేశ్వరం ప్రాంతాలకు చెందిన మరబోట్లు, పుట్టీలు కృష్ణానదిలో నడిపేందుకు అనుమతులు లేనందున నిషేధిస్తూ ఆంక్షలు విధిస్తున్నట్లు కలెక్టర్ తెలిపారు. తెలంగాణ ప్రాంతం నుంచి మరబోట్లు, పుట్టీలకు లైసెన్సులు ఉన్నట్లయితే అందులో ప్రయాణించే ప్రయాణికుల నుంచి ఒక్కొక్కరికి రూ. 30 చొప్పున రాయల్టీ వసూలు చేసి సంబంధిత గ్రామ పంచాయతీకి చెల్లించే విధంగా చర్యలు తీసుకోవాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు. ప్రయాణికుల భద్రతా కారణాల దృష్ట్యా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా నిర్ణయం తీసుకున్నట్లు కలెక్టర్ తెలిపారు. నిబంధనలను అతిక్రమించి సంగమేశ్వరం, సిద్ధేశ్వరం ఘాట్ల నుంచి సోమశిల వరకు మరబోట్లు, పుట్టీలు నడిపితే చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. సింగోటం జాతరకు వెళ్లే ప్రయాణికులకు ఇబ్బంది లేకుండా నందికొట్కూరు, ఆత్మకూరు డిపోల నుంచి అవసరమైన బస్సులు ఏర్పాటు చేయాలన్నారు.

శాస్త్రోక్తంగా కూడారై ఉత్సవం



స్వామికి నివేదించిన 108 రకాల ప్రసాదాలు

ఆళ్లగడ్డ: దిగువ అహోబిల క్షేత్రంలో ధనుర్మాస ఉత్సవాల్లో భాగంగా 27వ రోజు బుధవారం కూడారై ఉత్సవాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఉత్సవ మూర్తులైన శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ ప్రహ్లాదవరదస్వామి, ఆండాల్ అమ్మవార్లను నూతన పట్టు వస్త్రాలతో అలంకరించి వేదపండితుల వేద మంత్రోచ్ఛారణలు, మంగళ వాయిద్యాలతో 108 రకాల్లో వండిన పాయసాలను గంగాళాలో ఉత్సవ మూర్తుల ఎదురుగా ఉంచి కూడారై ఉత్సవాన్ని నిర్వహించారు. అనంతరం ప్రసాదాలను భక్తులకు పంపిణీ చేశారు. రాత్రి గ్రామోత్సవం నిర్వహించి కార్యక్రమాన్ని ముగించారు.



పూజలు చేస్తున్న అర్చకులు

ఎడిట్ ఆప్షన్‌ను సద్వినియోగం చేసుకోవాలి

నంద్యాల(సిటీ): పదో తరగతి విద్యార్థులకు ప్రభుత్వం కల్పించిన ఎడిట్ ఆప్షన్‌ను సద్వినియోగం చేసుకోవాలని డీఈఓ అనురాధ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యార్థి పేరు, తండ్రి, తల్లిపేరు, పుట్టిన తేదీ, ఫస్ట్, సెకండ్ లాంగ్వేజ్‌ల ఎంపిక, విద్యార్థి మాధ్యమం, వైకల్యం, ఒకేషనల్ సబ్జెక్ట్ కోడ్, గుర్తింపు చిహ్నాలు, ఫొటో, సంతకం, తదితర వివరాలు తప్పుగా ఉంటే ఈనెల 20వ తేదీ వరకు సవరణకు అవకాశం ఉందన్నారు.

యువ శక్తి.. విజయ దీప్తి

- వివేకానంద స్ఫూర్తితో ముందుకు సాగుతున్న యువత
- విభిన్న రంగాల్లో రాణింపు
- నేడు జాతీయ యువజన దినోత్సవం




వివేకానందుడు ఓ వ్యక్తి కాదు. మహాశక్తి. తన మాటల మంత్రంతో ఎందరినో ప్రభావితం చేశారు.తన వాగ్ధాటితో అందరి హృదయాల్లో చెరగని స్థానం సంపాదించుకున్నారు. దేశ యువతను జాగృతం చేశారు. ఎన్నో ఒత్తిళ్ల మధ్య బతుకుతూ చిన్నచిన్న సమస్యలకే అఘాయిత్యాలకు పాల్పడుతున్న యువకులు వివేకానందుడి గురించి తెలుసుకున్నా, ఆయన సూక్తులు వినినా చాలు ఎనలేని ఆత్మవిశ్వాసంతో లక్ష్య సాధన వైపు ముందడుగు వేస్తారు. అలాంటి మహనీయుడి జయంతిని ఏటా జనవరి 12న జాతీయ యువజన దినోత్సవంగా జరుపుకుంటాం. ఉమ్మడి కర్నూలు జిల్లాలో సుమారు 16 లక్షల మంది యువతీయువకులు ఉన్నారు. వీరిలో కొందరు వివిధ రంగాల్లో రాణిస్తూ యువతకు ఆదర్శంగా నిలుస్తున్నారు.

– కర్నూలు కల్చరల్

డైరెక్షన్ అంటే ప్యాషన్



డైరెక్షన్ చేస్తున్న ఈ యువకుడి పేరు మహమ్మద్ సాధిక్. కర్నూలులోని మారుతీ నగర్‌లో నివాసం ఉంటారు. బీకాం డిగ్రీ చదివారు. నాన్న ఖాజాహుసేన్ ఆర్టీసీ ఉద్యోగి. అమ్మ అక్తరున్నీసా గృహిణి. రెండో సంతానమైన సాధిక్‌కు చిన్నప్పటి నుంచి సినిమాలంటే పిచ్చి. మంచి దర్శకుడిగా గుర్తింపు తెచ్చుకోవాలన్నది కల. దీనిని నెరవేర్చుకునేందుకు షార్ట్ ఫిల్మ్స్ తీయడం ప్రారంభించారు. ఈ క్రమంలో సమాజాన్ని చైతన్య పరచడం, వివిధ సామాజిక రుగ్మతలపై అవగాహన కల్పించే అంశాలతో పలు లఘుచిత్రాలను రూపొందించారు. అవి ప్రేక్షకాదరణ పొందడంతో పాటు ఉత్తమ చిత్రాలుగా నిలిచాయి. 2014లో మొదటి షార్ట్ ఫిల్మ్ చిన్ని ఆశ, 2015లో నేను నాన్న, 2016లో త్యాగం, 2017లో మేరా భారత్ మహాన్, 2017లో ప్రయాణం, 2019లో అవర్ ఎమ్మెల్యే చిత్రాలను తెరకెక్కించి పలువురితో ప్రశంసలు అందుకున్నారు. ప్రస్తుతం డియర్ ఫ్రెండ్ చిత్రం తీయబోతున్నట్లు సాధిక్ పేర్కొన్నారు.



ఎందరికో స్ఫూర్తి కీర్తన

చదువుతో పాటు క్రీడల్లో రాణిస్తోంది లలితకీర్తన. కర్నూలు నగరంలోని సంతోష్ నగర్‌కు చెందిన ఈ యువతి ఇటీవల అనంతపురం శ్రీకృష్ణ దేవరాయ విశ్వ విద్యాలయంలో బీటెక్ పూర్తి చేసింది. తల్లి కె.శ్యామలమ్మ వాణిజ్య పన్నుల శాఖలో సీనియర్ అసిస్టెంట్‌గా పని చేస్తున్నారు. కుమార్తెను చిన్నప్పటి నుంచే కఠినమైన మార్షల్ ఆర్ట్స్ క్రీడ వైపు ప్రోత్సహించింది. అందివచ్చిన ప్రతి అవకాశాన్ని సద్వినియోగం చేసుకుంటూ 2015 సంవత్సరంలో ఏకంగా మూడు బంగారు పతకాలు గెలుచుకుంది. ఇందులో రెండు జిల్లా స్థాయిలో, ఒకటి రాష్ట్రస్థాయి పోటీల్లో సాధించింది. 2016 దక్షిణ భారతీయ ఛాంపియన్ షిప్ పోటీల్లో, 2017లో కేరళ రాష్ట్రంలోని కన్నూరు పట్టణంలో నిర్వహించిన జాతీయ స్థాయి తైక్వాండోలో సత్తాచాటి గోల్డ్‌మెడల్స్ సాధించింది. పురుషులకే పరిమితంగా భావించే తైక్వాండోలో దాదాపుగా ఏడేళ్లుగా పలు బంగారు పతకాలు సాధిస్తూ యువతకు స్ఫూర్తిగా నిలుస్తోంది.



పోలీస్ అధికారి కావడమే లక్ష్యం



ఈ అమ్మాయి పేరు జి. త్రివేణి. ఎమ్మిగనూరులో జనరల్‌స్టోర్ నిర్వహిస్తున్న పద్మావతి, వెంకటేశ్వర్లు కుమార్తె. కేవీఆర్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో డిగ్రీ తృతీయ సంవత్సరం బీకాం, డిజిటల్ మార్కెటింగ్ చదువుతుంది. ఎన్‌సీసీలో చురుగ్గా పాల్గొంటుంది. ఈ క్రమంలో ఇండియన్ ఎయిర్ ఫోర్స్ ఏక్ భారత్ – శ్రేష్ఠ భారత్ పేరుతో నిర్వహించిన దేశ పర్యటనకు ఎంపికైంది. రాయలసీమ జోన్ నుంచి ఎంపికైన ఏకైక విద్యార్థిని. పర్యటనలో భాగంగా గతేడాది అక్టోబర్ 9 నుంచి 18వ తేదీ వరకు ఇస్రో, బెంగళూరు, శ్రీహరికోట, హిందుస్థాన్ ఏరోనాటికల్ లిమిటెడ్, ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్సెస్ వంటి ప్రసిద్ధ శాస్త్ర సాంకేతిక కేంద్రాలను సందర్శించారు. సివిల్స్‌లో రాణించి మంచి పోలీస్ అధికారి కావడం తన లక్ష్యంగా ముందుకు సాగుతున్నట్లు చెప్పారు.

ప్రాణాలు తీసిన విద్యుదాఘాతం



మృతి చెందిన గోవింద్

ఆదోనిఅర్బన్: విద్యుదాఘాతంతో ఓ యువకుడు మృతి చెందాడు. బసాపురం ట్యాంకు వద్ద బుధవారం ఈ ఘటన చోటుచేసుకుంది. మృతుడి తండ్రి మల్లప్ప, అన్న కృష్ణ తెలిపిన వివరాల మేరకు.. గోవిందు(30) విద్యుత్ పనులు చేసుకుంటూ జీవనం సాగించేవాడు. బసాపురం ట్యాంకు వద్ద విద్యుత్ లైన్ లాగేందుకు ట్రాన్స్‌ఫార్మర్ ఎక్కాడు. గాలికి వైర్లు ఊగుతూ గోవిందు షాక్‌కు గురై అక్కడికక్కడే మృతి చెందాడు. గోవిందుకు భార్య లక్ష్మి, ముగ్గురు మగ పిల్లలు ఉన్నారు. తన కుమారుడు విద్యుత్‌శాఖకు లేబర్ కాదని, కేవలం వైర్ లాగేందుకు వెళ్లాడని, తమ కుమారుడిని ట్రాన్స్‌ఫార్మర్ ఎక్కించి చంపారని తండ్రి మల్లప్ప ఆరోపించారు. మృతుని బంధువులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

క్రీడాకారుల సంక్షేమానికి కృషి

- జిల్లా క్రీడాప్రాధికార సంస్థ సీఈఓ రమణ

కర్నూలు (టౌన్): యువ క్రీడాకారుల సంక్షేమానికి కృషి చేస్తామని జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ సీఈఓ రమణ అన్నారు. బుధవారం స్థానిక స్పోర్ట్స్ అథారిటీ ఔట్‌డోర్ స్టేడియంలో జిల్లా స్థాయి శాప్ షూటింగ్ బాల్ ఎంపిక పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా సీఈఓ మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా శాప్ లీగ్ పేరుతో క్రీడా పోటీలు పెద్ద ఎత్తున నిర్వహిస్తున్నట్లు చెప్పారు. శాప్ లీగ్ పోటీల్లో మంచి ప్రతిభ చాటి రాష్ట్ర స్థాయిలో గుర్తింపు తెచ్చుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో స్పోర్ట్స్ అథారిటీ చీఫ్ కోచ్ నటరాజారావు, సెట్కూర్ మేనేజర్ సత్యనారాయణ, జిల్లా షూటింగ్ బాల్ అసోసియేషన్ కార్యదర్శి ఈశ్వర్‌నాయుడు పాల్గొన్నారు.



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న సీఈఓ

వచ్చేనెల 14 నుంచి శివరాత్రి ఉత్సవాలు

మహానంది: ఫిబ్రవరి 14 నుంచి మహానందిలో శివరాత్రి బ్రహ్మోత్సవాలు నిర్వహించనున్నట్లు ఈఓ చంద్రశేఖరరెడ్డి తెలిపారు. ఈ ఉత్సవాలకు సంబంధించిన పనులను బుధవారం ప్రారంభించారు. జంగిల్ క్లియర్స్ పనుల్లో భాగంగా ప్రారంభ పూజలు చేపట్టి ఈఓ మాట్లాడారు. స్వామి దర్శనానికి వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకుంటున్నామన్నారు. గతేడాది కంటే ఈసారి శివరాత్రి ఉత్సవాలకు మరింత మెరుగ్గా ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో వేదపండితులు రవిశంకర అవధాని, ధర్మకర్తల మండలి సభ్యులు గంగిశెట్టి మల్లికార్జునరావు, వీరభద్రుడు, సూపరింటెండెంట్ ఒంకారం వెంకటేశ్వరుడు, అర్చకులు పాల్గొన్నారు.



శివరాత్రి పనులను ప్రారంభిస్తున్న ఈఓ, ధర్మకర్తల మండలి సభ్యులు

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

గోనెగండ్ల: మండల పరిధిలోని ఎస్.లింగందిన్నె గ్రామ సమీపంలో మంగళవారం అర్ధరాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో గాజులదిన్నె గ్రామానికి చెందిన సంపత్ కుమార్(26) అనే వ్యక్తి మృతి చెందినట్లు ఎస్‌ఐ తిమ్మారెడ్డి తెలిపారు. ఆయన తెలిపిన వివరాల మేరకు.. గాజులదిన్నె గ్రామానికి చెందిన సంపత్ కుమార్ ఎస్. లింగందిన్నె గ్రామంలో జరిగే దస్తగిరయ్య స్వామి ఉరుసుకు మంగళవారం ద్విచక్ర వాహనంపై వెళ్లాడు. రాత్రి ద్విచక్ర వాహనంపై తిరిగి వస్తుండగా ఎస్. లింగందిన్నె గ్రామ సమీపంలో రోడ్డుపక్కన ఉన్న కల్వర్టును ఢీకొన్నాడు. తలకు తీవ్ర గాయం కావడంతో సంపత్‌కుమార్ అక్కడికక్కడే మృతిచెందాడు. మృతుడికి భార్య రాజేశ్వరి, ఇద్దరు కుమారులు, కూతురు ఉన్నారు. భార్య రాజేశ్వరి ఇచ్చిన ఫిర్యాదు మేరకు బుధవారం కేసు నమోదు చేసుకుని, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

బైక్‌ను ఢీకొన్న బొలెరో

- యువకుడికి తీవ్ర గాయాలు

కల్లూరు: ఉలిందకొండ పోలీసు స్టేషన్ పరిధిలో 44వ జాతీయ రహదారిపై కేవీ సుబ్బారెడ్డి కళాశాల దగ్గర బైక్‌ను బొలెరో వాహనం ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో యువకుడికి తీవ్ర గాయాలయ్యాయి. ఉలిందకొండ ఎస్‌ఐ నల్లప్ప తెలిపిన వివరాల మేరకు.. లక్ష్మీపురానికి చెందిన కె.వంశీ అనే యువకుడు తన సొంత పని నిమిత్తం బైక్‌పై దూపాడుకు వచ్చాడు. పని ముగించుకుని కేవీ సుబ్బారెడ్డి కళాశాల దగ్గర జాతీయ రహదారి ఎక్కుతుండగా బెంగళూరు నుంచి కర్నూలు వైపు వస్తున్న బొలెరో వాహనం(ఇంకా రిజిష్టర్ కాలేదు) అతివేగంగా ఢీకొట్టింది. యువకుడికి తీవ్ర గాయాలవడంతో 108లో కర్నూలు ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకెళ్లారు. యువకుని తల్లి కె.లక్ష్మీదేవి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

ఆటో బోల్తా.. తొమ్మిది మందికి గాయాలు

గోనెగండ్ల: కుక్కను తప్పించబోయి ఆటో బోల్తా పడింది. బుధవారం రాత్రి జరిగిన ఈ ప్రమాదంలో తొమ్మిది మందికి తీవ్రగాయాలయ్యాయి. వేముగోడు గ్రామానికి చెందిన వ్యవసాయ కూలీలు దస్తగిరి, లక్ష్మి, లక్ష్మీదేవి, అనిత, మద్దిలేటి, రోషిణి, పెద్దక్క, నాగమ్మ, లింగమ్మ బుధవారం ఉదయం ఆటోలో కులుమాల గ్రామంలో పనులకు వెళ్లారు. అక్కడ పనులు ముగించుకొని సాయంత్రం తిరిగి ఆటోలో వేముగోడు గ్రామానికి వెళ్తున్న క్రమంలో పుట్టపాశం గ్రామంలో కుక్క అడ్డువచ్చింది. దానిని తప్పించబోయే క్రమంలో ఆటో అదుపు తప్పి బోల్తా పడింది. అందులో ప్రయాణిస్తున్న తొమ్మిది మందికి కూలీలకు తీవ్ర గాయాలయ్యాయి. అందులో నలుగురి పరిస్థితి విషమంగా ఉంది. గాయపడిన వారిని 108లో కోడుమూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. దస్తగిరి, లక్ష్మి, నాగమ్మ, లింగమ్మ పరిస్థితి విషమంగా ఉండడంతో చికిత్స నిమిత్తం కర్నూలు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

కర్నూలులో జిల్లా స్థాయి పోటీలు

కర్నూలు (టౌన్): నగర శివారులోని ఆదర్శ ఇంగ్లిషు మీడియం పాఠశాల క్రీడామైదానంలో ఈనెల 20, 21 తేదీల్లో జిల్లా స్థాయి అండర్ -14 , ఈనెల 29, 30వ తేదీల్లో అండర్-17 విభాగంలో బాల బాలికలకు రగ్బీ పోటీలు నిర్వహిస్తున్నట్లు జిల్లా స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ కార్యదర్శి లక్ష్మయ్య బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 23 నుంచి 25వ తేదీ వరకు అండర్ -17 బాల బాలికలకు వాలీబాల్, ఈనెల 27 నుంచి 29వ తేదీ వరకు అండర్-14, అండర్-17 విభాగంలో బాలబాలికలకు ఫెన్సింగ్ పోటీలు కర్నూలులోని ఏ. క్యాంపు మాంటిస్సోరి పాఠశాల క్రీడా మైదానంలో నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు.

చెంచుగూడేలలో మొబైల్ ఆధార్ కేంద్రాలు

- జిల్లా కలెక్టర్ మనజీర్ జిలానీ శామూన్

నంద్యాల: ఆధార్ కార్డు లేక చెంచు గూడేల గిరిజనులు సంక్షేమ పథకాలకు దూరమవుతున్నారని తెలుసుకున్న జిల్లా కలెక్టర్ మనజీర్ జిలానీ శామూన్ తక్షణమే స్పందించారు. జిల్లాలోని అన్ని చెంచుగూడేలలో 13, 14 తేదీల్లో మొబైల్ ఆధార్ నమోదు కేంద్రాల శిబిరాలు ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు జిల్లా కలెక్టర్ మంగళవారం బండిఆత్మకూరు మండలం నాయిని చెరువు చెంచుగూడెంలో ఆకస్మికంగా పర్యటించారు. ఆ సమయంలో గూడెంకు చెందిన దివ్యాంగురాలు దాసరి ఈదమ్మ తనకు పింఛన్ రావడం లేదని ఆదుకోవాలని కలెక్టర్‌ను వేడుకున్నారు. కాగా కలెక్టర్ పరిశీలనలో సుమారు 12 మందికి ఆధార్ కార్డులు లేవని తెలుసుకున్నారు. తక్షణమే స్పందిస్తూ బుధవారం గూడెంలో ఆధార్ ప్రత్యేక శిబిరం ఏర్పాటు చేయించి దరఖాస్తు చేయించారు. అలాగే దాసరి ఈదమ్మకు మూడు చక్రాల సైకిల్‌ను కూడా అందజేయించారు. అలాగే చెంచు గూడేలలో ఆధార్ సమస్యను పరిష్కరించేందుకు జిల్లా వ్యాప్తంగా గురు, శుక్రవారాల్లో అన్ని చెంచుగూడేలలో మొబైల్ ఆధార్ నమోదు కేంద్రాలు ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. ఇందుకు సంబంధించి సంబంధిత సచివాలయ డిజిటల్ అసిస్టెంట్లు, పంచాయతీ సెక్రెటరీలకు ఆధార్ నమోదుకు కావాల్సిన సామగ్రి, ఇతర మెటీరియల్ సమకూర్చుకోవాల్సిందిగా సూచించారు. ఇప్పటివరకు చెంచు గూడేలలో ఆధార్ నమోదు చేసుకోని వారు, ఈకేవైసీ పూర్తి చేసుకోని వారు మొబైల్ ఆధార్ నమోదు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అవకాశాన్ని చెంచుగూడెల ప్రజలందరూ వినియోగించుకోవాలని ఆయన ఆ ప్రకటనలో స్పష్టం చేశారు.



నాయినీ చెర్వు చెంచుగూడెంలో మొబైల్ ఆధార్ కేంద్రం

ట్రిపుల్ ఐటీలో ఇండోర్ స్టేడియం ప్రారంభం

కర్నూలు(సిటీ): నగర శివారులోని జగన్నాథగట్టుపై ఉన్న ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ అండ్ డిజైన్ మ్యానుఫ్యాక్చరింగ్ (ట్రిపుల్ ఐటీ)లో రూ.3 కోట్లతో ఇండోర్ స్టేడియాన్ని నిర్మించారు. ఈ స్టేడియాన్ని బుధవారం జిల్లా కలెక్టర్ పి.కోటేశ్వరరావు ఆన్‌లైన్‌లో ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ట్రిపుల్ ఐటీ డైరెక్టర్ డీవీఎల్ఎన్ సోమయాజులు, రిజిస్ట్రార్ గురుమూర్తి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ట్రిపుల్ ఐటీ డైరెక్టర్ సోమయాజులు మాట్లాడుతూ ఇండోర్ గేమ్స్ నిర్మాణానికి కేంద్ర ప్రభుత్వం రూ.3 కోట్లు మంజూరు చేసిందన్నారు. నిర్దేశించిన సమయం లోపే నిర్మాణ పనులు పూర్తయ్యాయన్నారు.

ప్రకృతి వ్యవసాయాన్ని విస్తరిద్దాం

- విశ్రాంత ఐఏఎస్ అధికారి రాయుడు సూచనలు

కర్నూలు(అగ్రికల్చర్): పెట్టుబడి లేని ప్రకృతి వ్యవసాయాన్ని విస్తరింప జేసేందుకు కృషి చేయాలని విశ్రాంత ఐఏఎస్ అధికారి, సీనియర్ కన్సల్టెంటు డాక్టర్ రాయుడు అన్నారు. రాయలసీమలోని ఎనిమిది జిల్లాల ప్రాజెక్టు మేనేజర్లు, అదనపు ప్రాజెక్టు మేనేజర్లు, సిబ్బందికి కర్నూలులో రెండు రోజుల శిక్షణా కార్యక్రమాన్ని ఆయన బుధవారం ప్రారంభించారు. రైల్వే స్టేషన్ సమీపంలోని ఓ హోటల్ సమావేశ భవనంలో జరిగిన వర్క్‌షాపులో ఆయన మాట్లాడుతూ... రాబోయే ఐదేళ్లలో ప్రకృతి వ్యవసాయాన్ని మరో 3 వేల గ్రామాలకు విస్తరింప చేయాలని లక్ష్యంగా తీసుకున్నట్లు తెలిపారు. ప్రకృతి వ్యవసాయం వల్ల వివిధ ప్రాంతాల్లో భిన్న ఫలితాలు వస్తున్నాయని, మరింతగా ప్రోత్సహించాలని పేర్కొన్నారు. రెండు రోజుల్లో గ్రామ స్థాయి నుంచి జిల్లా స్థాయి వరకు ప్రణాళికలు తయారు చేయాలని వివరించారు. ప్రకృతి వ్యవసాయంలో రైతులకు మెరుగైన జీవితంతో పాటు సమాజానికి సురక్షితమైన ఆహారం అందించాలనే తపన ఉండేలా రైతుల్లో చైతన్యం తేవాలని సూచించారు. మరో సీనియర్ కన్సల్టెంటు మురళీధర్ మాట్లాడుతూ... రాష్ట్రంలో 3,730 గ్రామాల్లో ఏపీ ప్రజా భాగస్వామ్య ప్రకృతి వ్యవసాయం పేరుతో ప్రకృతి వ్యవసాయం అమలవుతోందన్నారు. ఈ కార్యక్రమంలో 5,500 గ్రామైక్య సంఘాలు పాలుపంచుకుంటున్నాయని పేర్కొన్నారు. ప్రకృతి వ్యవసాయాన్ని మరింత విస్తరింప జేయాలనేది రైతు సాధికార సంస్థ ఉద్దేశమని, దీనిని పెద్ద ఎత్తున రైతుల్లోకి తీసుకెళ్లాలని వివరించారు. జిల్లా వ్యవసాయాధికారి పీఎల్ వరలక్ష్మి మాట్లాడుతూ... రైతులు ప్రకృతి వ్యవసాయం చేపట్టేందుకు ఆసక్తి చూపుతున్నారని, అయితే ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తులకు మార్కెటింగ్ సదుపాయం అవసరమన్నారు. పూర్వీకులు ఎలాంటి కెమికల్స్ లేని వ్యవసాయం చేశారని, మళ్లీ ఇపుడు అదే వ్యవసాయాన్ని చేపట్టడం ద్వారా నాణ్యమైన పంటలకు అవకాశం ఏర్పడిందన్నారు. సమావేశంలో రైతు సాధికార సంస్థ కన్సల్టెంట్లు రామచంద్రం, సురేంద్రరెడ్డి, రాజేశ్వర్, లక్ష్మి, దుర్గ, థిమాటిక్ లీడ్స్ ధర్మేంద్ర, సురేష్‌బాబు, రాయలసీమ జిల్లాల ప్రాజెక్టు మేనేజర్లు చంద్రశేఖర్, నరేంద్రరెడ్డి, వాసు, మునిరత్నం, లక్ష్మానాయక్, రామకృష్ణంరాజు తదితరులు పాల్గొన్నారు.



వర్క్‌షాపును ప్రారంభిస్తున్న విశ్రాంత ఐఏఎస్ అధికారి రాయుడు, డీఏఓ వరలక్ష్మి తదితరులు

FORM NO.14 {See Regulation 33(2)}
By Regd. A/D, Dasti failing which by Publication

OFFICE OF THE RECOVERY OFFICER - I/II
DEBTS RECOVERY TRIBUNAL HYDERABAD (DRT 2)
1st Floor, Triveni Complex, Abids, Hyderabad-500001.

DEMAND NOTICE

NOTICE UNDER SECTIONS 25 TO 28 OF THE RECOVERY OF DEBTS & BANKRUPTCY ACT, 1993 AND RULE 2 OF SECOND SCHEDULE TO THE INCOME TAX ACT, 1961.

RC/499/2019 27-12-2022

Canara Bank (Earlier Syndicate Bank)
Versus
RK Electrical Industries

To

(CD 1) **M/s R.K Electrical Industries**, Represented by its partner, S. Rama Kullayamma, R/o Sy.No. 540/1, Pydi, Padakandla Village, Allagadda Mandal, Kurnool District-518 543.

(CD 2) **S Ramakrishnudu, S/o S. K. Ganganna**, R/o D. No. 5-112, Markandeya Street, Padakanda Village, Allagadda Mandal, Kurnool District-518 543.

(CD 3) **S Rama Kullayamma, W/o Ramakrishnudu**, R/o D. No. 5-112, Markandeya Street, Padakandla Village, Allagadda Mandal, Kurnool District-518 543.

(CD 4) **S Venkata Krishnaiah, S/o S. K. Ganganna**, R/o D. No. 5-112, Markandeya Street, Padakandla Village, Allagadda Mandal, Kurnool District-518543.

1. This is to notify that as per the Recovery Certificate issued in pursuance of orders passed by the Presiding Officer, DEBTS RECOVERY TRIBUNAL HYDERABAD (DRT 2) in OA/933/2018 an amount of Rs 80990324.00 (Rupees Eight Crore Nine Lakh Ninety Thousands Three Hundred Twenty Four Only) along with pendentelite and future interest @ 13 % w.e.f. 04.07.2019 till realization and costs of Rs 0 (Only) has become due against you (Jointly and severally/ Fully/Limited).
2. You are hereby directed to pay the above sum within 15 days of the receipts of the notice, failing which the recovery shall be made in accordance with the Recovery of Debts Due to Banks and Financial Institutions Act, 1993 and Rules there under.
3. You are hereby ordered to declare on an affidavit the particulars of yours assets on or before the next date of hearing.
4. You are hereby ordered to appear before the undersigned on **28/02/2023** at 10:30 a.m. for further proceedings.
5. In addition to the sum aforesaid, you will also be liable to pay:
   (a) Such interests as is payable for the period commencing immediately after this notice of the certificate / execution proceedings.
   (b) All costs, charges and expenses incurred in respect of the service of this notice and warrants and other processes and all other proceedings taken for recovering the amount due.

Given under my hand and the seal of the Tribunal, on this date: 27.12.2022

Sd/- Recovery Officer
Debts Recovery Tribunal Hyderabad (DRT 2)